AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

9-7-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

వనమహోత్సవ సందడి

నిలిచిన మధ్యాహ్న భోజనం

తెలంగాణ వర్సిటీలో జాబ్‌మేళా

అక్షరటుడే, డిచ్‌పల్లి: తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. హెటిరో డ్రగ్స్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు చేపట్టారు. ఈ సందర్భంగా వీసీ యాదగిరిరావు మాట్లాడుతూ వర్సిటీలోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో సౌత్ క్యాంపస్, గిరిరాజ్ కాలేజ్, అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. మొత్తంగా 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా 54మంది రాతపరీక్షలో ఎంపికయ్యారని తెలిపారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థుల తుదిజాబితాను పంపుతామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. జాబ్‌మేళాలో రిజిస్ట్రార్ యాదగిరి, అధ్యాపకులు నాగరాజు, బాలకిషన్, నాగరాజు, కాంట్రాక్ట్ అధ్యాపకులు గంగాకిషన్, సురేష్, రాజేశ్వరి, నాగేశ్వరరావు, సునీత పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి సీఐ బదిలీ

అక్షరటుడే, లింగంపేట: ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ బుధవారం బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మెదక్ సీసీఎస్‌లో పనిచేస్తున్న రాజారెడ్డి రానున్నారు. రాజారెడ్డి గతంలో నిజామాబాద్ జిల్లాలో సుదీర్ఘ కాలం పాటు ఎస్సైగా పనిచేశారు.

ప్రమోషన్లలో ప్రాధాన్యత ఇవ్వాలి

అక్షరటుడే, ఇందూరు : జిల్లాలో 2002లో ప్రమోషన్ పొందిన తమకు గెజిటెడ్ హెచ్ఎం పదోన్నతుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్ఏ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు బుధవారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2002 డీఏస్సీలో నేరుగా ఎస్ఏ పోస్టుకు ఎంపికైన వారికి కాకుండా, అప్పటికే ఎస్‌జీటీలుగా సర్వీసులో ఉండి 2002లో ఎస్ఏలు పదోన్నతి పొందిన తమకే గజిటెడ్ హెచ్ఎం పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నీనియారిటీ ప్రకారం ఆ పోస్టులకు అర్హులమని, ఈ విషయమై కోర్టులో తుది తీర్పు వెలువడకుండానే వారిని నియమించడం సరికాదన్నారు. కార్యక్రమంలో వి.సురేశ్, బి.వసంత్, బాలాజీ, రాజి, ధర్మపీర్, తదితరులున్నారు.

ఇందూరులో జానులిరి సందడి

ప్రముఖ డ్యాన్సర్, ఢీ షో ఫేమ్ జానులిరి ఇందూరులో సందడి చేసింది. నగరంలోని ఓ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఓపెనింగ్ కార్యక్రమానికి హాజరైంది. ఈ సందర్భంగా స్టైలిష్ వేసి ఆకట్టుకుంది. ఆమెను చూసేందుకు పలువురు అభిమానులు తరలివచ్చారు.

– అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్

నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు
- ఆధునిక హంగులతో ముస్తాబవుతున్న ప్రాంగణం
- త్వరలోనే పనులు పూర్తయ్యే అవకాశం
- పెరగనున్న మరో రైల్వే ట్రాక్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌కు మహర్దశ రానుంది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు కీలకంగా ఉన్న ఈ స్టేషన్ రూపురేఖలు త్వరలో మారనున్నాయి. నిత్యం ఎంతో మంది ప్రయాణికులు నిజామాబాద్ మీదుగా రాకపోకలు సాగిస్తారు. అలాంటి స్టేషన్‌లో ఆధునిక హంగులతో సకల సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ భారత్ స్టేషన్ పథకంలో ఈ రైల్వేస్టేషన్ ఎంపికైంది. ఈ పథకంలో భాగంగా స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నారు.

- అక్షరటుడే, ఇందూరు

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.53.03 కోట్ల మంజూరు చేసింది. పనులు కూడా మొదలు పెట్టారు. అయితే ఆధునికీకరణ పనులు పూర్తయ్యే నాటికి బడ్జెట్ మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం స్టేషన్ ముఖ ద్వారం, ప్రయాణికులు వేచి ఉండే గదులు, ప్లాట్ ఫామ్ షెడ్డు, లిఫ్ట్ తదితర పనులు వేగంగా చేపడుతున్నారు.

సకల వసతులతో..

రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. స్టేషన్‌లో ఆధునిక హంగులతో పలు భవనాలు, ఫ్లోరింగ్, రూఫ్ లను నిర్మించనున్నారు. ట్రాక్‌ల శుభ్రత, దివ్యాంగుల కోసం వీల్ చైర్స్, ఆధునిక ట్రాక్‌ల ఏర్పాటు, ర్యాంపులు, కేఫ్ ఏరియా, రెస్ట్ రూమ్స్ ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు స్టాళ్లు, మీటింగ్ హాళ్లు, స్టేషన్లకు ఇరువైపులా అప్రోచ్ రోడ్లు, వెహికల్స్ నిలిపేందుకు విశాలమైన పార్కింగ్, పాదచారులకు ప్రత్యేక దారి, ఆధునిక లైటింగ్‌తో సహా వైపై సేవలకు తపర్లు ఏర్పాటు చేయనున్నారు.

ప్లాట్‌ఫామ్‌ల సంఖ్య పెంపు

నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం మూడు ప్లాట్ ఫామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే అవి సరిపోవడం లేదు. ప్లాట్‌ఫామ్‌ల సంఖ్యను పెంచాలని అధికారులు నిర్ణయించారు. అలాగే ప్రస్తుతం ఐదు ట్రాక్లు అందుబాటులో ఉండగా .. మరో ట్రాక్ పెరగనుంది. వృద్ధులు మహిళలకు సౌకర్యంగా ఉండేందుకు మరో లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు రెండు ఎస్కలేటర్లను కూడా స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్నారు.

మరో ఆరు నెలలు

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 2023లో భారత్ అమృత్ పథకం కింద 40 స్టేషన్లను నవీకరణ కోసం ఎంపిక చేసింది. ఇందులో నిజామాబాద్ ఒకటి. గతేడాది పనులు ప్రారంభం కాగా.. 2024 డిసెంబర్‌లో పూర్తి కావాల్సి ఉంది. మరో ఆరు నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

విద్యార్థుల్లో దేశభక్తిని నింపేది ఏబీవీపీ

అక్షరటుడే, ఇందూరు: అఖిల భారత విద్యార్థి పరిషత్ తో యువతలో జాతీయ వాదం అలవడుతుందని నేషనల్ వర్కింగ్ కమిటీ మెంబర్ రూపీ అన్నారు. బుధవారం జాతీయ విద్యార్థి దినోత్సవం, ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏబీవీపీ ఆవిర్భవించి 77 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. ఏడు దశాబ్దాలలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని నిలబడిందన్నారు. జాతీయ జెండా కోసం ప్రాణాలు అర్పించిన విద్యార్థులు ఉన్న ఏకైక విద్యార్థి సంస్థ ఏబీవీపీ పేర్కొన్నారు. నేషన్ ఫస్ట్ అనే నినాదంతో విద్యార్థుల్లో దేశభక్తిని నింపుతూ ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో ఇందూర్ విభాగ్ కన్వీనర్ శశిధర్, జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, నగర అధ్యక్షుడు వెంకటకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ సునీల్, జోనల్ ఇన్‌చార్జి దుర్గా దాస్, శ్రీకాంత్, ప్రేమ్, నన్నీ, మున్నా తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

జిల్లాకు మూడు కొత్త సబ్ స్టేషన్లు మంజూరు

అక్షరటుడే, కామారెడ్డి: జిల్లాకు మూడు సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రవణ్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం విలేకరులకు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా మెరుగైన విద్యుత్ సరఫరాకు చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తాడ్వాయి మండలం చిట్యాల, నిజాంసాగర్ మండలం మహమ్మద్ నగర్, బాన్సువాడ మండలం బొర్లం గ్రామాల్లో నూతన సబ్ స్టేషన్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో చిట్యాల, మహమ్మద్ నగర్ సబ్ స్టేషన్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. బోర్లం సబ్ స్టేషన్ టెండర్ ప్రాసెస్‌లో ఉందన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా అవసరం మేరకు కొత్తగా సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామని, భవిష్యత్తులో ఎటువంటి లోవోల్టేజ్ సమస్య ఉండదని ఎస్ఈ పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధికి అనుగుణంగా కొత్తసబ్ స్టేషన్ల రాకతో రైతులకు, వినియోగదారులకు అంతరాయాలు తగ్గుతాయని స్పష్టం చేశారు.

పల్లె దవాఖానాలతో గ్రామీణుల చెంతకే వైద్యం

పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

అక్షరటుడే, ఆర్మూర్: పల్లెల్లో ప్రజలందరికీ వైద్యాన్ని చేరువ చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె దవాఖానాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాల్కొండ నియోజకవర్గంలో రూ. 1.20 కోట్లతో నిర్మించిన మూడు పంచాయతీ భవనాలు, మూడు పల్లె దవాఖానాలను ఆయన ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పల్లెల్లో నాణ్యమైన వైద్యం అందాలనే ఆలోచనతో మాజీ సీఎం కేసీఆర్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లారని గుర్తు చేశారు. అనంతరం మెండోరా మండలం సోనాపేట్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ చిన్నోళ్ల రమేష్, మాజీ ఎంపీటీసీ మాదుగుల నాగలక్ష్మి, తోపాల హన్మాండ్లు, రాజేష్, ముత్యం, సాగర్, మల్లేష్, ప్రశాంత్, పులి గంగాధర్, రాజన్న, శ్రావణ్, మదన్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

అక్షరటుడే, ఇందూరు: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ అమలయితే ప్రజలపై భారపడుతుందన్నారు. వ్యవసాయదారులకు సబ్సిడీ తగ్గుతుందని, ఉద్యోగ భద్రతపై ముప్పు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ రఘునందన్, కన్వీనర్ బాలేష్‌కుమార్, కో-కన్వీనర్ తోట రాజశేఖర్, నాయకులు కాశీనాథ్, చంద్రశేఖర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

నగరంలోని పెద్దబజార్ ప్రాంతంలోని మసీదు వద్ద భారీ గుంత ప్రమాదకరంగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఈ గుంత కారణంగా అనేక ప్రమాదాలు జరిగాయి. నిత్యం ఆర్టీసీ బస్సులు కూడా ఇదే రహదారిపై వెళ్తుంటాయి. ప్రమాదాలు జరగకుండా ఇటీవల కొందరు గుంతపై బారికేడ్లను ఉంచారు. శ్మరగా దీనిని పూడ్చివేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

వికలాంగులకు పింఛన్ల హామీని నెరవేర్చాలి

అక్షరటుడే, కామారెడ్డి: అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు రూ. 6వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిందని.. వెంటనే హామీని అమలు చేయాలని వికలాంగులు డిమాండ్ చేశారు. బుధవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో ఎమ్మార్పీఎస్, పీహెచ్‌పీఎస్ నాయకులతో కలిసి వికలాంగులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంథని సామ్యేల్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

గళమెత్తిన కార్మిక లోకం..

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక చట్టాలపై నిరసనగా బుధవారం దేశవ్యాప్త సమ్మె నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు.

– మిగతా 2వ పేజీలో..

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
2
నిజామాబాద్/కామారెడ్డి
బుధవారం
9.7.2025
www.aksharatoday.in
AKSHARA TODAY

నిలిచిన మధ్యాహ్న భోజనం..

అక్షరటుడే, నిజాంసాగర్: పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిలిచిపోవడంతో విద్యార్థులు పస్తులున్నారు. బుధవారం దేశవ్యాప్త కార్మికుల సమ్మె కారణంగా జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులు ఒకరోజు సమ్మె చేపట్టారు. దీంతో మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది.

నిజాంసాగర్ మండల కేంద్రంలో..

నిజాంసాగర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం అందించలేదు. దీంతో మాగి గోర్గుల్, జీవీఆర్ ఫ్యాక్టరీ వద్దేపల్లి గ్రామాల విద్యార్థులు మధ్యాహ్నానికి ఇళ్లకు వెళ్లిపోయారు. నిజాంసాగర్ మండల కేంద్రంలో ఉండి చదువుకునే విద్యార్థులు మాత్రం ఇళ్లకు వెళ్లి భోజనాలు చేసి తిరిగి

ఇంటిదారి పట్టిన విద్యార్థులు

స్కూల్‌కు వెళ్లారు. బీసీ వసతి గృహంలో విద్యార్థులకు అప్పటికప్పుడు భోజనాలు తయారు చేయించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక..

నిజాంసాగర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం చర్చనీయాంశమైంది. దేశవ్యాప్త సమ్మె ఉన్నట్లు ముందుగానే సమాచారం ఉన్నప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు. ఉపాధ్యాయులు మాత్రం పక్కనే ఉన్న బీసీ వసతి గృహం నుంచి భోజనాన్ని తెప్పించుకొని భోజనం చేసినట్లు తెలిసింది. విద్యార్థులు మాత్రం ఇళ్లకు వెళ్లిపోయారు.

బోధన్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఇందల్వాయి ఫారెస్ట్ నర్సరీలో మొక్క నాటుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

అక్షరటుడే, బోధన్/ఆర్మూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రెండో విడత వనమహోత్సవంలో భాగంగా బోధన్ మండలం బెల్లాల్ గ్రామంలో కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 51కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిబుధవారం ఇందల్వాయి ఫారెస్ట్ నర్సరీలో ఏర్పాటు చేసిన వనమోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మొక్క నాటారు.

ఆర్మూర్: ఆలూర్ మండలంలోని దేగాంలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మొక్కలు నాటారు. అనంతరం లక్ష్మీ నృసింహాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

దేగాంలో మొక్కకు నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. దోమకొండ మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి సంఘాల సంబరాలు నిర్వహించారు. చింతమాన్ పల్లి, ముత్యంపేట, దోమకొండ గ్రామాల్లోని జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ప్రతి మహిళ కోటీశ్వరురాలు కావాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, వ్యాకా మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

అక్షరటుడే, లింగంపేట: వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుధ్య పనులు పక్కాగా చేయాలని డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. లింగంపేట మండలం పోల్కంపేట గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అశ్విక్ పాల్గొన్నారు.

ఎస్సై, ఏఎస్సైలకు సన్మానం

అక్షరటుడే, లింగంపేట: మండలానికి నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్సై దీపక్ కుమార్, ఏఎస్సై మధుసూదన్‌ను బుధవారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర నారా గౌడ్, వాహబ్, బైరయ్య, కాసీం, ప్రసాద్ గౌడ్, గుండ బాలకిషన్, నగేష్, రాజు, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న వయస్సులోనే పుస్తకం రాయడం భేష్

అక్షరటుడే, ఇందూరు: చిన్న వయస్సులోనే అద్భుతమైన పుస్తకం రాయడం అభినందనీయమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. నగరానికి చెందిన తేజస్వి తిరునగిరి రచించిన 'ఫర్మ్యూట్ ఆఫ్ హ్యాపీనెస్' అనే పుస్తకాన్ని హైదరాబాద్‌లోని మల్లారెడ్డి మెమోరియల్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీటెక్ పూర్తిచేసిన తేజస్వి రచనలో కనిపించే దృష్టికోణం, సామాజిక స్పృహ ప్రతి పాఠకుడికి మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. రచయిత్రి తేజస్వి మాట్లాడుతూ పుస్తకం వల్ల వచ్చే ఆనందం తాత్కాలికమని.. కానీ మంచి పని చేస్తే వచ్చే సంతృప్తి శాశ్వతం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ యాజమాన్యం అనంత జనార్దన్, పాఠశాల డైరెక్టర్ తుంబి, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు తిరునగరి శ్రీహరి, మాదం మహిపాల్ ధర్మారెడ్డి, ప్రసన్న వీణరాజి పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగంపేట మండలంలో పోలీసుల తనిఖీలు

అక్షరటుడే, లింగంపేట: మండలంలోని పెద్దవాగ సమీపంలో బుధవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై మధుసూదన్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న చలాన్ల వసూలు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం.. అధ్వానం..

అక్షరటుడే, ఆర్మూర్: ప్రభుత్వం పందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పారిశుధ్య చర్యలు చేపడుతోంది. కానీ ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో పూర్తిగా నెరవేరడం లేదు. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలోని సి కన్వెన్షన్ వద్ద రోడ్డుపై మురుగునీరు పారుతోంది. దీంతో దుర్గంధం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

అక్షరటుడే, ఇందల్వాయి: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యురాలు క్రిస్టినా సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రాంపూర్‌లోగల ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ ఈవో శంకర్, హెల్త్ సూపర్‌వైజర్ అక్బర్ అలీ, మాలిక, ఏఎన్‌ఎం‌లు సుల్తానా, కీర్తన, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్సిటీలో పిచ్చిమొక్కల తొలగింపు

అక్షరటుడే,డిచ్‌పల్లి: తెలంగాణ విశ్వవిద్యాలయంలో పిచ్చిమొక్కలను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం క్రీడాప్రాంగణంలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వైస్ ఛాన్సలర్ టి.యాదగిరిరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రవంతి, డాక్టర్ స్వప్నను అభినందించారు.

కంకర లారీ బోల్తా

అక్షరటుడే, బాన్సువాడ: కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన బీర్కూర్ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్ నుంచి తిమ్మాపూర్ వైపు వెళ్తున్న కంకర లారీ అదుపుతప్పి బీర్కూరు శివారులో బోల్తాకొట్టింది. లారీ డ్రైవర్ ఘటన స్థలం నుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. కాగా.. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

'కేటీఆర్‌తో చర్చకు సీఎం భయపడ్డారు..'

అక్షరటుడే, ఆర్మూర్: రైతులకు ఇచ్చిన హామీలపై చర్చకు సవాల్ విసిరిన సీఎం రేవంత్‌రెడ్డి..కేటీఆర్‌తో చర్చకు రమ్మంటుకు భయపడ్డారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం విడదల చేశారు. ప్రెస్‌క్లబ్‌లో మీడియా, ప్రజల సాక్షిగా సీఎంతో చర్చించేందుకు కేటీఆర్ ఆహ్వానిస్తే సీఎం రేవంత్ ఢిల్లీకి పారిపోయారని ఎద్దేవా చేశారు. రేవంత్‌కు మాటలు తప్ప చేతలు సాధ్యంకావన్నారు. కనీసం మంత్రులు కూడా చర్చకు రాకపోవడం ప్రభుత్వ దొల్లతనానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పాలనా వైఫల్యంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరి పాలనలో మళ్లీ సమైక్యాంధ్ర పాలకుల రోజులు వచ్చాయనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కనుమరుగయ్యే రోజు దగ్గర్లోనే ఉందని, రేవంత్ మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని స్పష్టం చేశారు.

పేకాడుతున్న పలువురికి జైలు

అక్షరటుడే, బోధన్: పేకాట కేసులో పలువురికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. టౌన్‌సీఐ వెంకట్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాకాసిపేట్‌లో పలువురు పేకాడుతున్నారనే సమాచారంతో దాడులు చేశారు. ఈ సందర్భంగా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ఎదుట హాజరుపర్చారు. విచారించిన న్యాయమూర్తి తొమ్మిది మందికి ఒకరోజు జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ తెలిపారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బాన్సువాడలో సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఎల్లారెడ్డి పట్టణంలో..

సమ్మె విజయవంతం..

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఉమ్మడి జిల్లాలో కార్మిక సంఘాలు, ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. విధులను బహిష్కరించి ఆందోళనలు చేపట్టారు. కార్మికులు ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు తీశారు. అనంతరం స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను వ్యతిరేకంగా తెచ్చిన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌కేఎం నాయకులు

కోటగిరి మండల కేంద్రంలో..

నిజాంసాగర్ మండల కేంద్రంలో..